నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, సోమవారం 25 మార్చి 2024 | MAHABUBNAGAR NARAYANPET



చెరుకుపల్లి ఆగ్రో ప్రొడక్ట్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో కాలిపోతున్న షెడ్డు

# భారీ అగ్ని ప్రమాదం

- చెరుకుపల్లి ఆగ్రో ప్రొడక్ట్ కంపెనీలో షార్ట్‌సర్క్యూట్
- రూ.2 కోట్లకు పైగా ఆస్తి నష్టం



భారీగా వ్యాపిస్తున్న మంటలు

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, మార్చి 24 : షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్ని ప్రమాదం జరిగిన ఘటన కోడూరు సమీపంలో చేరుకుపల్లి ఆగ్రో ప్రొడక్ట్ కంపెనీలో శనివారం రాత్రి చోటు చేసుకున్నది. అగ్ని మాపక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాకు చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెరుకుపల్లి రాజేశ్వర్ మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని కోడూర్ గ్రామ సమీపంలోని రాంరెడ్డిగూడెం వద్ద కొన్నేళ్లుగా చెరుకుపల్లి ఆగ్రో ప్రొడక్ట్ కంపెనీ పేరుతో అక్కడ రైస్ బ్రౌన్ (తౌడు), ఆయిల్ ఫ్యాక్టరీ నిర్వహిస్తున్నారు. అయితే శనివారం రాత్రి 10:30 గంటల ప్రాంతంలో ఫ్యాక్టరీలో ఎవరూ లేని సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. గుర్తించిన స్థానికులు వెంటనే కంపెనీ నిర్వాహకులకు సమాచారం అందించారు. వారు అగ్నిమాపక అధికారులు, పోలీసులకు సమాచారమిచ్చారు. వారు వచ్చేలోగా కంపెనీలో విలువైన సామగ్రితోపాటు ట్రాక్టర్ మంటల్లో దగ్ధమైంది. అయితే గోదాంలో తౌడు ఎక్కువగా ఉండడంతోపాటు పూర్తిగా నూనె పదార్థం కావడంతో మంటలు క్షణాల్లో పెద్దగా వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయగా అప్పటికే దాదాపు రూ.2 కోట్లకు పైగా ఆస్తి నష్టం జరిగిందని కంపెనీ యజమానులు తెలిపారు. ఈ ఘటనపై అగ్నిమాపక అధికారులు కేసు నమోదు చేసి ఎంత మేర ఆస్తినష్టం జరిగిందని దర్యాప్తు చేపట్టగా ఇన్సూరెన్స్ అధికారులు సైతం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అయితే ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణహాని జరుగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



బసవేశ్వర జిన్నింగ్, కాటన్ మిల్లులో మంటలను ఆర్పుతున్న ఫైర్‌స్టేషన్ సిబ్బంది

# జిన్నింగ్ మిల్లులో రూ.8 కోట్ల ఆస్తినష్టం

మాగనూరు, మార్చి 24 : మండలంలోని వడ్వాట్ సమీపంలోని బసవేశ్వర కాటన్ అండ్ జిన్నింగ్ మిల్లులో ఆదివారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నది. వడ్వాట్‌కు వెళ్తున్న వ్యక్తులు కాటన్ మిల్లులో మంటలు చూసి 100కు డయల్ చేశారు. అలాగే పోలీసులు, ఫైర్ స్టేషన్, మిల్లు యజమానికి సమాచారం అందించారు. అగ్ని మాపక సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకొని మిల్లులో పనిచేసే సిబ్బందితో కలిసి మంటలను అదుపు చేశారు. అప్పటికే మిల్లులోని కాటన్ బండిల్స్, విత్తనాలు, మిషనరీ షెడ్డు దగ్ధమయ్యాయి. అయితే మంటలు చెలరేగడానికి షార్ట్‌సర్క్యూట్ కారణమని మిల్లు యజమాని తెలిపారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.8 కోట్ల మేర ఆస్తి నష్టం జరిగిందని వాపోయారు.


విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం యజమానిని పరామర్శించి కలెక్టర్‌తో మాట్లాడి ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మిల్లు యజమాని దండె తిమ్మన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

# కనులపండువగా కందూరు రామలింగేశ్వరస్వామి ఊరేగింపు

మూసాపేట(అడ్డాకుల), మార్చి 24 : దక్షిణ కాశీగా పేరుగించిన కందూరు రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం రామలింగేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఆలయ పూజారులు తమ్మలి వంశస్తుల ఇంటి నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లారు. మంగళవాయిద్యాలు, బాజా భజంత్రీలు, భజనలు చేస్తూ అత్యంత వైభవంగా స్వామి ఊరేగింపు నిర్వహించారు. అదేవిధంగా పూర్వపు ఆచారం ప్రకారం గ్రామానికి చెందిన దళిత కుటుంబ సభ్యులు మొదటి దాసంగాలు సమర్పించారు. ఆదివారం తెల్లవారుజామున ప్రభోత్సవం నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున నిర్వహించే రథోత్సవానికి అలంకరణ చేసి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. అలాగే హోమం, కుంబాభిషేకం, తెప్పోత్సవం తదితర ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టినట్లు నిర్వాహకులుతె లిపారు.



స్వామి వారి ప్రభోత్సవం నిర్వహిస్తున్న అర్చకుడు



అమ్మవారికి కుంకుమార్చన చేస్తున్న అర్చకులు

# శ్రీగిరిలో లక్ష కుంకుమార్చన

శ్రీశైలం, మార్చి 24 : శ్రీశైల భ్రమరాంబామల్లికార్జునస్వామిక్షేత్రంలో పాల్గుణమాస పౌర్ణమి పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించి లోక కల్యాణార్థం పరివార దేవతలకు అర్చనలు, అభిషేకాలు జరిపించినట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆలయ ప్రాకారంలో స్వామి, అమ్మవార్లను పల్లకీలో ఆశీనులను చేసి ఆలయ, క్షేత్ర గిరి ప్రదక్షిణలు చేశారు. వేదపండితులు నందిమండపం నుంచి బయలు వీరభద్రస్వామి ఆలయం మీదుగా శివనామస్మరణ చేస్తూ సాగిన గిరి ప్రదక్షిణలో యాత్రికులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. సంధ్యా సమయంలో అమ్మవారికి లక్ష కుంకుమార్చన చేసి ఊయల, పల్లకీ సేవలు జరిపించారు. ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన ఊయలలో స్వామి, అమ్మవార్లను ఆశీనులను చేసి అర్చకులు అష్టోత్తర నామావళిని పఠించారు. ఉభయ ఆలయాల్లో పౌర్ణమి పూజల్లో పాల్గొనే భక్తులకు ఏర్పాట్లు చేసినట్లు ఏఈవో హరిదాసు తెలిపారు.

***పరోక్షసేవకు విశేష ఆదరణ***

భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న పరోక్షసేవకు విశేష ఆదరణ లభిస్తున్నదని ఈవో పేర్కొన్నారు. భక్తులు www.srisailadevasthanam.org వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని ఈవో పెద్దిరాజు కోరారు.

# 8వ శతాబ్దపు శివలింగం పరిశీలన



శివలింగ పానపట్టాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

తెలకపల్లి, మార్చి 24: మండలంలోని పెద్దపల్లి గ్రామ సమీపంలో ఉన్న బుగ్గస్వామి గుట్టపై క్రీ.శ. 8వ శతాబ్దానికి చెందిన శివలింగాన్ని పురావస్తు పరిశోధన శాఖ, ప్లీచ్ ఇండియా సీఈవో శివనాగిరెడ్డి ఆదివారం పరిశీలించారు. కవి వనపట్ల సుబ్బయ్య, ముచ్చర్ల దినకర్ ఇచ్చిన సమాచారం మేరకు పురావస్తు శాఖవారు ఇక్కడికి వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివలింగం కూటుల కాలం నాటిదని తెలిపారు. శివలింగానికి సంబంధించిన పానపట్టాన్ని పరిశీలించిన తర్వాత ఇది క్రీస్తు శకం 8వ శతాబ్దానికి చెందినదిగా పేర్కొన్నారు. ఆయన వెంట అర్చకుడు వంశీకృష్ణ తోపాటు గ్రామస్తులు ఉన్నారు.



ధాన్యాన్ని ఆరబోస్తున్న మహిళా రైతు (ఫైల్)

***బోనస్ ఇచ్చి ఆదుకోవాలి..***



ఐదు ఎకరాల్లో వరి సాగుచేశా. ఫిబ్రవరి ఆఖరు నుంచి బోరు బావుల్లో నీళ్లు తగ్గుతూ వచ్చాయి. ఏదో విధంగా వరిచేను ఎండిపోకుండా తడులు వేస్తున్నాను. మరో 10, 20 రోజుల్లో వరి పంట కోతకు వస్తుంది. ఈ సారి వాతావరణం కూడా సరిగ్గా లేకపోవడం, నీళ్లు రాకపోవడంతో దిగుబడి చాలా తక్కువగా వస్తుందనిపిస్తుంది. ఇక భారమంతా ప్రభుత్వంపైనే. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం వరికి బోనస్ ఇస్తే రైతులకు కొంత మేలు జరుగుతుంది. మాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేసీఆర్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

*- కె.జనార్దన్‌రెడ్డి, రైతు, తాండ్ర గ్రామం*

# బోనస్.. బోగస్!

- ధాన్యానికి మద్దతు ధరపై రూ.500 బోనస్ అంటూ ఎన్నికల వేళ హామీలు
- అధికారంలోకి వచ్చాక 'చేయి'చ్చిన సర్కారు
- ఇప్పటివరకు కార్యాచరణ ప్రకటించనిప్రభుత్వ ం
- మరో పది రోజుల్లో ప్రారంభం కానున్న వరి కోతలు
- హామీలు అమలు చేయాలని రైతు సంఘాల డిమాండ్

కల్వకుర్తి, మార్చి 24 : అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ధాన్యానికి ప్రస్తుతం ఉన్న మద్దతు ధరపై క్వింటాకు బోనస్‌గా రూ.500 ఇస్తామని రైతులకు హామీ ఇచ్చింది. ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా చేర్చింది. అధికారం వచ్చిన వంద రోజుల్లోనే హామీలను అమలు చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా వరికి బోనస్‌పై ఉలుకు పలుకు లేదు. మరో వారం పది రోజుల్లో వరి కోతలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటి వరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు, బోనస్ ధరపై ఎటువంటి కార్యాచరణ ప్రకటించలేదు. రైతుబంధు విషయంలో పిల్లిమొగ్గలు వేస్తున్న ప్రభుత్వం, బోనస్‌పై కూడా మంత్రులు తలో విధంగా మాట్లాడుతూ గందరగోళానికి తెరలేపుతారేమోనని అనుమానాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు. రైతులకు ఇచ్చిన ప్రధాన హామీలు రైతు భరోసా (పెట్టుబడి సాయం ఎకరానికి రూ.15వేలు), రుణమాఫీ (రూ.2లక్షలు), ధాన్యానికి బోనస్ నీటి మీద రాతలుగా మిగిలిపోతాయా అన్న ప్రశ్నలు అన్నదాత మదిలో మెదులుతున్నాయి. రుణమాఫీలాగా కుంటిసాకులు వెతకకుండా వరిధాన్యం కొనుగోళ్లు చేసి రూ.500 బోనస్‌పై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

***గత యాసంగిలో..***

గత యాసంగిలో నాగర్‌కర్నూల్ జిల్లాలో 1.60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం దిగుబడి వచ్చింది. ఎంజీకేఎల్ఐ ద్వారా జిల్లాకు సాగునీరు అందడం, భూగర్భ జలాలు పైకి రావడంతో పెద్ద ఎత్తున వరిపంటను సాగు చేశారు. ధాన్యం దిగుబడిని అంచనా వేసినా కేసీఆర్ ప్రభుత్వం వాటి కొనుగోళ్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మార్చి నుంచే కసరత్తులు ప్రారంభించింది. పీఏసీసీఎస్, మహిళా సంఘాల వంటి ఏజెన్సీలను అప్రమత్తం చేసింది. అధికారులకు దిశా నిర్దేశం చేసింది. ధాన్యం దిగుబడి ప్రారంభం కాగానే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రైతుల కల్లాల వద్దకే వెళ్లి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నది.

ధాన్యం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి వారం లోపే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసింది. ఇదంతా యుద్ధప్రాతిపదికన జరిగింది. ప్రభుత్వం మారడంతో పరిస్థితి మళ్లీ మొదటి కొచ్చినట్లైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

***ఈ యాసంగిలో..***

గతేడాది యాసంగిలో పెద్ద ఎత్తున వరి సాగుచేసిన రైతులు ఈ సారి పూర్తి స్థాయిలో సేద్యం చేయలేకపోయారు. డిసెంబర్ నెల మొదట్లోనే ఎంజీకేఎల్ఐ కాల్వ నీళ్లు బంద్ అయ్యాయి. ఈ ప్రభావంతో రైతులు ధాన్యాన్ని పెద్దగా సాగు చేయలేదు. కాల్వల నీళ్లు బంద్ కావడం, క్రమక్రమంగా భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో సాగు చేసిన వరి పంటలకు నీళ్లు సరిపోలేని దుస్థితి నెలకొంది. నీళ్లు తక్కువ కావడంతో పంట దిగుబడిపై ప్రభావం చూపుతున్నది. దీనికి తోడు వాతావరణం సహకరించకపోవడంతో వరి పైరు ఏపు గా పెరగలేదు. ఈ యాసంగిలో జిల్లాలో వరి ధాన్యం దిగుబడి 70 వేల నుంచి 80 వేల మెట్రిక్ టన్నులు మించకపోవచ్చని రైతులు చెబుతున్నారు.

***కష్టాల్లో రైతాంగం..***

యాసంగిలో వరి సాగుచేసిన రైతులకు కష్టాలు ఎదురుకానున్నాయి. సాగునీరు సరిగ్గా లేకపోవడంతో పంట దిగుబడి గణనీయంగా తగ్గనున్నది. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఉంది. ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేయడంతోపాటు ఇచ్చిన హామీ ప్రకారం రూ.500 బోనస్ ధర ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. అందుకు అవసరమైన కార్యాచరణ వెంటనే ప్రారంభించాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం మాదిరిగానే ధాన్యం కొనుగోలు చేసిన వారం రోజుల్లోనే ఖాతాల్లో బోనస్‌తో కూడిన డబ్బు జమ చేయాలని రైతులు కోరుతున్నారు.




రథోత్సవానికిభా రీగా తరలివచ్చిన భక్తులు

- రంగనాథుడి తేరుకు భారీగా హాజరైన భక్తులు
- పగటి పూట ఉత్సవాలు జరుగడం విశేషం
- ఐదు వేల మందికి అన్నదానం
- శ్రీరంగాపురంలో ప్రారంభమైన జాతర

# వైభవంగా రథోత్సవం

పెబ్బేరు, మార్చి 24 : శ్రీరంగాపురం రంగనాథస్వామి రథోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు.. భక్తజన కోటికి ఆరాధ్యుడైన రంగనాథుడు తిరువీధుల్లో ఊరేగాడు. కనుల పండువగా సాగిన ఈ రథోత్సవాన్ని వేలాది మంది భక్తులు తిలకించి తన్మయత్వం పొందారు. శ్రీరంగాపురంలోని రంగనాథస్వామి ఆలయంలో ఏటా జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన రథోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచే గాక, పొరుగు జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఏ ఆలయంలోనైనా రథోత్సవాలు రాత్రి పూట జరుగుతుండగా.. ఇక్కడ విశేషంగా పగటి పూటే నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఉదయం 11 గంటలకు మొదలైన కార్యక్రమం మధ్యాహ్నం 2 గంటలకు ముగిసింది. రథోత్సవంతోపాటు 15 రోజుల పాటు జరిగే జాతర ప్రారంభమైంది.



ఉత్సవాలకు హాజరైన కృష్ణదేవరావు,మా జీ ఎంపీ రావుల


శ్రీదేవి, భూదేవీ సమేతుడైన రంగనాథస్వామిని వేద మంత్రోచ్చారణల మధ్య రథంపై ఊరేగించే ఘట్టాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్త కృష్ణదేవరావు ప్రారంభించగా ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవానికి హాజరైన భక్తులకు శ్రీరంగాపురం గ్రామ సేవా సమితి వారు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సుమారు ఐదు వేల మందికి వారు భోజన వసతి కల్పించారు. అలాగే, సేవాభారతి, నారాయణదాసు కుటుంబీకులు మజ్జిగ, వాలీబాల్ అసోసియేషన్ వారు తాగునీటి సౌకర్యం కల్పించారు. జాతర సందర్భంగా పలు రకాల దుకాణాలు వెలిశాయి. భక్తులు పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. ఆదివారం సెలవు కావడంతో ఉత్సవానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.



రోడ్డుకిరువైపులా దగ్ధమైన మొక్కలు

# మొక్కలు దగ్ధం

తాడూరు, మార్చి 24 : రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రతి గ్రామంలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలు పెంచే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టింది. కానీ కొన్ని గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలను తగులబెట్టడంతో ఈ మంటల్లో మొక్కలు, చెట్లు దగ్ధమైపోతున్నాయి. మండలంలోని తుమ్మలసూగూర్ నుంచి కుమ్మెర గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ మొక్కలన్నీ ఏపుగా పెరిగాయి. చుట్టు పక్కల ఎండిన గడ్డి ఉండడంతో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టగా రోడ్డు పొడవునా ఉన్న మొక్కలన్నీ దగ్ధమయ్యాయి. ఇందుకు కారణమైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవడంతోపాటు అధికారులు మొక్కల సంరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



చోరీ జరిగిన ప్రదేశాన్నిప రిశీలిస్తున్న పోలీసులు

# 12 తులాల బంగారం చోరీ

మక్తల్ టౌన్, మార్చి 24 : గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి 12 తులాల బంగారాన్ని అపహరించిన ఘటన మక్తల్ పట్టణంలో ఆదివారం చోటు చేసుకున్నది. ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి కథనం మేరకు.. రాఘవేంద్ర కాలనీలో నివాసం ఉంటున్న మన్యం కొండ అనే విద్యాశాఖ ఉద్యోగి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రాత్రి ఎయిర్ కూలర్ పెట్టుకొని ఇంటి తలుపులు తెరిచి పడుకున్నాడు. ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న 12 తులాల బంగారాన్ని అపహరించారు. ఉదయం లేచిన కుటుంబ సభ్యులకు బీరువా తెరిచి ఉండడం గమనించి వస్తువులు చూడగా, బీరువాలో ఉన్న 12 తులాల బంగారం కనిపించలేదు. చోరీ జరిగిందని గ్రహించి పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ చంద్రశేఖర్ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి నిందితుల వేలి ముద్రలను పరిశీలించారు. మ న్యంకొండ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

# మత్స్యరంగ అభివృద్ధికి చేయూతనివ్వాలి

- అసోసియేట్‌డీన్ నా గలక్ష్మి

పెబ్బేరు, మార్చి 24 : పెబ్బేరు మత్స్య కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు రాష్ట్రంలో మత్స్యరంగ అభివృద్ధికి తమ వంతు చేయూతనందించాలని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ నాగలక్ష్మి సూచించారు. ఏడు రోజుల ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ఆదివారం ముగియగా ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాబోయే కాలంలో మత్స్య రంగానికి మంచి భవిష్యత్తు ఉందని చెప్పారు. అనంతరం ఆమె విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అంతకు ముందు విద్యార్థులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి దేవానంద్, బోధక సిబ్బంది ముత్తప్పకవి, అనూష, శాంత, హారిక, రామకృష్ణారెడ్డి తదితరులున్నారు.



శిబిరంలో పాల్గొన్న విద్యార్థులతో నాగలక్ష్మి